క్లుప్తంగా

నేడు భైంసాలో పోలీస్ ప్రజావాణి

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ జానకీ షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీదారుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. భైంసా డివిజన్ పరిధిలోని ఫిర్యాదుదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గడువు పొడిగింపు

నిర్మల్‌చైన్‌గేట్: బీసీ న్యాయవాదులు 2025–26 సంవత్సరానికి న్యాయపరిపాలనలో శిక్షణ పొందేందుకు దరఖాస్తు గడువు ఈనెల 21 వరకు పొడిగించినట్లు అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారు 39 ఏళ్లలోపు ఉండి, బార్ అసోసియేషన్ సభ్యత్వం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని వివరించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



మాట్లాడుతున్న డీఈవో రామారావు

సోన్: విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించి అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని డీఈవో రామారావు అన్నారు. మంగళవారం సోన్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆరాధన, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల నమోదు పెంచాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచి మెనూ ప్రకారం భోజనం అందించాలని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు నర్సయ్య, లింబాద్రి, ఎంఈవో పరమేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్లాస్టిక్ వస్తువులు కొనొద్దు

ఖానాపూర్: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించి ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను కొనవద్దని మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వాసవి మాత ఆలయంలో వ్యాపారులకు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. నాయకులు సంతోష్, బుచ్చన్న, జితేందర్, యాదగిరి తదితరులు ఉన్నారు.

ఇళ్లు నాణ్యతతో నిర్మించాలి



భాగాపూర్‌లో పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టి.. వేగంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని భాగాపూర్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లోకేశ్వరం ఎస్సీ హస్టల్‌లో రికార్డులు, మరుగుదొడ్డిని పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ విద్యార్థుల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. ఎంపీవో సోలామన్‌రాజ్, వార్డెన్ సుజిత్‌రెడ్డి ఉన్నారు.

18న తరలిరావాలి

సోన్: జిల్లాకేంద్రంలోని మాలి సంఘ భవనంలో ఈనెల 18న మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి నాయకులు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు శనిగారపు రవి మాదిగ అన్నారు. మంగళవారం మండలంలోని న్యూబొ ప్పారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కత్తిరపాక శంకర్, రాజు, శ్రీనివాస్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

‘రోడ్డు ఆక్రమణ అడ్డుకోవాలి’

భైంసాటౌన్: పట్టణంలోని ఖత్‌గాం మార్గంలో రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఖత్‌గాం మార్గంలో ఓ జిన్నింగ్ ఫ్యాక్టరీ యజమాని రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నాడని.. దీనిని అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ డెగ్లూర్ రాజు, గ్రామస్తులు ఉన్నారు.

పంటలు పరిశీలన

తానూరు: మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని ఉద్యానశాఖ అధికారి ఎస్కే జావిద్ పాషా అన్నారు. మంగళవారం మండలంలోని ఖర్బాల గ్రామంలో ఆయిల్ పామ్, కూరగాయలు, పూలు, పండ్ల మొక్కల తోటను పరిశీలించారు. పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయిల్‌పాం క్లస్టర్ అధికారి మోయిన్, యోగేశ్వర్, పంచాయతీ కార్యదర్శి జీవన్, రైతులు దిశ్వనాథ్, దిగాంబర్, సాయినాథ్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కలగానే ‘డబుల్’ ఇళ్లు

- ఖానాపూర్‌లో అనర్హుల తొలగింపుపై వీడని చిక్కుముడి
- సర్వే పేరిట అధికారుల కాలయాపన
- హైకోర్టులో బాధితుల న్యాయపోరాటం
- అర్హులకు కేటాయించాలని వేడుకోలు



ఖానాపూర్‌లో కలెక్టర్‌కు విన్నవిస్తున్న బాధితులు (ఫైల్)



పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలోని ప్రభుత్వ స్థలంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేదల కోసం నిర్మించిన 408 డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీపై చిక్కుముడి వీడటం లేదు. గతంలో స్వీకరించిన 1482 దరఖాస్తుల నుంచి 708 మంది లబ్ధిదారులను అధికారులు గుర్తించారు. లక్కీ డ్రా పద్ధతిన 406 మందికి ఇళ్లను కేటాయించారు. అనంతరం ఇల్లు రాని మరో 300 మంది పలు పార్టీల నాయకులతో రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. లక్కీ డ్రాలో ఎంపికైన 400 మందిలో 100 మందికి పైగా అనర్హులు ఉన్నారని.. వారిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

పేదల న్యాయపోరాటం..

అర్హులకు న్యాయం చేయాలని పలువురు బాధితులు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరుల దృష్టికి తీసుకెళ్లినా అనర్హులను తొలగించలేదు. దీంతో విసిగిపోయిన లబ్ధిదారులు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం ద్వారా న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. కొద్ది నెలల కిందట కోర్టు ఆదేశాల మేరకు అనర్హుల విషయమై పలువురు అధికారులు ఇల్ల కేటాయింపుపై ప్రత్యేక విచారణ బృందాలతో రహస్య సర్వే చేపట్టారు. ఇటీవల ఖానాపూర్‌కు వచ్చిన కలెక్టర్ అభిలాష అభినవ్‌ను సైతం పలువురు బాధితులు కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. సర్వే జరుగుతుందని, నివేదిక అందాక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

సర్వేపై కాలయాపన...

అధికారులు చేపట్టిన సర్వే ఏడాది కావొస్తున్నా.. తదుపరి చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు పొందినవారిలో కొందరు వాటిల్లో ఉండకుండా తాళం వేసుకున్నారని పేర్కొంటున్నారు. మరికొందరు తమ నివాసాలను బినామీలకు అద్దెకు ఇస్తున్నారని వీటిని పరిగణనలోకి తీసుకొని విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపులో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేసి అనర్హులను తొలగించి అర్హులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

విచారణ సాగుతోంది



డబుల్ బెడ్ రూం ఇళ్ల విషయమై కలెక్టర్ మేరకు నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి అధికారులతో సర్వే చేయిస్తున్నారు. ప్రస్తుతం ఈ విషయం ఉన్నతాధికారుల పరిధిలో ఉంది. విచారణ పూర్తి అయ్యాక తదుపరి వివరాలు వెల్లడిస్తాం. లబ్ధిదారులు ఆందోళన చెందవద్దు.

– సుందర్‌సింగ్, మున్సిపల్ కమిషనర్

రోడ్డు పక్కన ఉంటున్నాం



మేం 30 ఏళ్లుగా ఖానాపూర్‌లో ఉంటున్నా ఇల్లు రాలేదు. దాతలు సరుకులు ఇస్తేనే మాకు పూట గ దుస్తోంది. అనర్హులకు ఇల్లు వచ్చింది. దివ్యాంగురాలినైనా నాకు రాలేదు. ప్రస్తుతం శాంతినగర్‌లో రోడ్డు పక్కనే చెట్టు కింద వృద్ధురాలైన తల్లి లక్ష్మితో కలిసి నివసిస్తున్నాం.

– లలిత, బాధిత దివ్యాంగురాలు, ఖానాపూర్

సమస్యలు తెలుసుకునేందుకే మార్నింగ్‌వాక్

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



కడెం : పెద్దూర్‌లో వృద్ధురాలిని అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

కడెం: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంతోపాటు, పెద్దూరు గ్రామంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకొని.. కొన్ని అక్కడికక్కడే పరిష్కరించారు. గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగు పరుస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని పనులకు శ్రీకారం చుడుతున్నట్లు వివరించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

పెంబి: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. వన మహోత్సవంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం, మందపల్లి కేజీబీవీ ఆవరణలో మొక్కలు నాటారు. కేజీబీవీ విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నీల్‌రెడ్డి, నాయకులు శంకర్, రమేశ్, మహేందర్ తదితరులు ఉన్నారు.

ఆశవర్కర్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

పెంబి: ఇల్లు లేని నిరుపేదలైన ఆశవర్కర్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మండలంలోని ఆశవర్కర్లు మంగళవారం మండల కేంద్రం వచ్చిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు వినతిపత్రం అందించారు. ఆశవర్కర్లు వినోద, మమత, లావణ్య తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో బోనాల వేడుకలు



కుంటాలలో ఆలయానికి వెళ్తున్న విద్యార్థులు



భైంసాలోని బోనాలతో చిన్నారులు

కుంటాల: మండలకేంద్రంలోని ఓ పాఠశాలలో మంగళవారం బోనాల పండుగ వేడుకలు అలరించాయి. ఈసందర్భంగా విద్యార్థినులు శివసత్తుల, పోతరాజుల వేషధారణలో ఆకట్టుకున్నారు. బోనాలు ఎత్తుకొని గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు,పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని పురాణబజార్‌లో ఉన్న ఓ పాఠశాలలో మంగళవారం బోనాల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనతరం అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించి బోనాలు సమర్పించారు. విద్యార్థులకు బోనాల పండుగ పై అవగాహన కల్పించినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ కృనాల్ ముంద్గా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు



దస్తురాబాద్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అధికారి

లోకేశ్వరం: రైతులకు నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో తహసీల్దార్ తనిఖీలు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని.. స్టాక్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలన్నారు. వెంట ఏవో గిరిరాజ్ ఉన్నారు.

దస్తురాబాద్: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే డీలర్ల లైసెన్సు రద్దు చేస్తామని ఇన్‌చార్జి ఏవో దినేశ్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పేర్కపల్లె, దస్తురాబాద్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఏఈవోలు తిరుపతి, కిరణ్ తదితరులు ఉన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి

సోన్: రైతులు యూరియా వాడకం తగ్గించాలని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, ఏడీఏ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని కూచన్‌పల్లి, బొప్పారం, న్యూవెల్మల్ గ్రామాల్లో సోయాబీన్, మొక్కజొన్న పంటలను మంగళవారం పరిశీలించారు. యూరియాకు బదులు నానో యూరియా, డీఏపీ వాడాలని తెలిపారు. కూచన్‌పల్లిలో చిలారి నవీన్ సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న కూరగాయలను పరిశీలించారు. ఘన, ద్రవ, జీవామృతం తయారు చేసే విధానం రైతుకు వివరించారు. అనంతరం సోన్ డీసీఎంఎస్‌లో ఎరువులను పరిశీలించారు. న్యూవెల్మల్‌లోని రిత్విజ, సౌమ్య ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఏవో వినోద్‌కుమార్, రైతులు రాజేశ్వర్, సాయన్న తదితరులు ఉన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

కుంటాల: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో అల్లాడి వనజ సూచించారు. మంగళవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపీవో ఎంఏ రహీం ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

‘హెచ్‌సీఏ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి’

నిర్మల్‌టౌన్: కొన్నేళ్లుగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హెచ్‌సీఏ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు, ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ప్రదీప్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) నిర్మల్ జిల్లా కోచ్ రామరాజు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

యువ నైపుణ్య దినోత్సవం

కుంటాల:యువత అవకాశాలను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంచుకోవాలని ప్రిన్సిపాల్ కాసు నవీన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కుంటాల ఆదర్శ పాఠశాలలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్, పాతసింగాపూర్, నాయకపుతండాలో మంగళవారం అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎరువులు, విత్తనాలు, వినియోగం వివరించారు. సంస్థ సలహాదారు కళామణి, సీఈవో పద్మ కొప్పుల, సుమన్, ఆనంద్‌రావు, నారాయణ, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

ధర్నాకు తరలిన నాయకులు

కుంటాల: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించారు. కుంటాల మండలం నుంచి బీసీ సంఘాల నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, బక్కి భోజన్న, బొంతల పోశెట్టి, వంశీ ముదిరాజ్ పాల్గొన్నారు.

మామడ: మహాధర్నాకు మండల బీఆర్‌ఎస్ నాయకులు వెళ్లారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌గౌడ్, అశోక్, మహేందర్, రత్నయ్య ఉన్నారు.

పాఠశాలలో నమూనా ఎన్నికలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని విజయ ఉన్నత పాఠశాలలో మంగళవారం నమూనా ఎన్నికలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యత, నామినేషన్లు దాఖలు చేయడం, బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం, ఓట్ల లెక్కింపుపై అవగాహన కల్పించారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. సోషల్ మీడియాను వినియోగించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల సెక్రటరీ అయ్యన్నగారి భూమయ్య, సుధాకర్, విజయలక్ష్మి, కరస్పాండెంట్ నాగభూషణం, ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

కడెం: రాష్ట్ర ప్రభుత్వం మహిళ సంక్షేమానికి కృషి చేస్తుందని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం కడెం రైతువేదికలో ఇందిరా మహిళా శక్తి సంబురాలు నిర్వహించారు. వారు హాజరై మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు అద్దె బస్సులు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం మహిళలకు స్త్రీనిధి పథకం కింద మంజూరైన చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మెనూ పాటించడం లేదు

- కుభీర్ గిరిజన పాఠశాలలో విద్యార్థినుల ఆవేదన
- ఇడ్లీకి బదులు కిచిడీ వడ్డించారని నిరసన



కిచిడీ చూపుతున్న విద్యార్థినులు

కుభీర్: మండలకేంద్రంలోని కుభీర్ గిరిజన బాలికల ఆశ్రమ ప్రాథమిక పాఠశాలలో మెనూ పాటించడం లేదని విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం మెనూ ప్రకారం అల్పాహారంగా ఇడ్లీసాంబార్ ఇవ్వకుండా కిచిడీ వడ్డించారని విద్యార్థినులు వాపోయారు. మూడో తరగతి నుంచి ఏడో తరగతి వరకు 200 మంది విద్యార్థినులు ఉంటారు. ఉదయం తొమ్మిది గంటల వరకు పాఠశాలలో ఉపాధ్యాయులు రాలేదు. 9 :12 గంటలకు ఇద్దరు.. కొద్దిసేపటికి మరో ఇద్దరు ఉపాధ్యాయులు వచ్చారు. ఇక్కడి పాఠశాలలో 9:05 గంటలకు ప్రార్థన నిర్వహించాల్సి ఉన్నా.. ఉపాధ్యాయుల రాక ఆలస్యంతో 9:15 గంటలకు పిల్లలతో ప్రార్థన చేయించారు. మరికొన్ని పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. ఈ విషయమై ఎంఈవో విజయ్‌కుమార్‌ను సాక్షి వివరణ కోరగా 9: 05 గంటలకు ప్రార్థన జరగాలన్నారు. బుధవారం పాఠశాలలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాల వార్డెన్ తిరుమల మాట్లాడుతూ ప్రధాన వంట మనిషి రాకపోవడంతో మెనూ మార్పు చేశామని.. నిబంధనల ప్రకారమే విద్యార్థినులకు ఆహారం అందిస్తున్నట్లు వివరించారు.

‘దివ్యాంగశక్తి’ని ప్రోత్సహిద్దాం



ప్రశంసాపత్రాలు అందుకున్న వారితో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి రాధిక

- అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి రాధిక
- పలువురికి దివ్యాంగమిత్ర పురస్కారాలు

నిర్మల్: వైకల్యం ఉందని దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దని, వారిని కొంత ప్రోత్సహిస్తే సకలాంగులతో సమానంగా ఏదైనా సాధించగలరని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా న్యాయసేవాసంస్థ(డీఎల్‌ఎస్‌ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో దివ్యాంగశక్తి ఫౌండేషన్ మూడో వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, దివ్యాంగుడైన పంచగుడి మహేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ముందుగా పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులను సాధించిన దివ్యాంగ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్ ఫైల్స్ అందించారు. దివ్యాంగుల కోసం సేవలందించిన వారిని దివ్యాంగమిత్ర పురస్కారాలతో సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ దివ్యాంగుల్లోనూ అంతర్లీనంగా అద్భుతశక్తి ఉంటుందన్నారు. ప్రోత్సహిస్తే వారూ రాణిస్తారని చెప్పారు. స్వతహాగా దివ్యాంగుడైన పంచగుడి మహేశ్ స్వయంఉపాధి పొందుతూ తాను సంపాదించిన దాంట్లో నుంచి సమాజానికి ఖర్చు చేయడం అభినందనీయమన్నారు. చుచుంద్ గ్రామంలో ఓ దివ్యాంగ కుటుంబానికి ఇల్లు కట్టించి ఇవ్వడం చాలా గ్రేట్ అన్నారు.

దివ్యాంగులకూ న్యాయసేవలు..

దివ్యాంగులకు ప్రత్యేక హక్కులతోపాటు చట్టాలు ఉన్నాయని విశిష్ట అతిథి డీఎల్‌ఎస్‌ఏ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి రాధిక అన్నారు. దివ్యాంగులకు ఏయే చట్టాలు రక్షణ కల్పిస్తాయో వివరించారు. ప్రముఖ కంటివైద్యుడు కృష్ణంరాజు మాట్లాడుతూ దివ్యాంగులపై జాలి, దయ మాత్రమే చూపకూడదని, వారికి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు సేవలందిస్తున్న వివిధ రంగాలకు చెందిన ముత్యంరెడ్డి(జిల్లా కార్మికశాఖాధికారి), మధుసూదన్(డీడబ్ల్యూవో), డాక్టర్ స్వప్న(పిల్లల వైద్యులు), స్వర్ణలత (సామాజికసేవకురాలు), రోహిత్‌ధర్మసేన(సామాజిక సేవకుడు), అవధూత్ నరేశ్(స్పెషల్ టీచర్), రాసం శ్రీధర్(పాత్రికేయుడు)లకు దివ్యాంగమిత్ర పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో డీఈవో రామారావు, పెన్షనర్ల సంఘం జాతీయ నాయకుడు ఎంసీ లింగన్న, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి దిగంబర్, పడిగెల లక్ష్మీనారాయణ, దశాగౌడ్, శ్రీనిధి ఫౌండేషన్, దివ్యాంగశక్తి ఫౌండేషన్ ప్రతినిధులు పద్మావతి, రజిత, అనూష, శ్యామ్, లక్ష్మణ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో వైబ్స్ అండ్ రిథమ్స్



విద్యార్థినిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఆర్‌కే కన్వెన్షన్ హాలులో అల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో వైబ్స్ అండ్ రిథమ్స్ అనే కార్యక్రమాన్ని మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్ఫోర్స్‌లో విలువలతో కూడిన విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చదువును నిర్లక్ష్యం చేయవద్దని.. ఉన్నత చదువులతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నాటికలు, కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, మెడికల్ కళాశాలలో సీట్లు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల సమాచారమివ్వాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాశ్‌కుమార్

భైంసారూరల్: ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని.. అపరిచితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్ అన్నారు. మంగళవారం తెల్లవారుజామున మండలంలోని మహాగాం గ్రామంలో పోలీసు సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. పోలీసులు ఇంటింటికీ వెళ్లి వాహనాలు, వ్యక్తుల వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కాలనీల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. యువత గంజాయి, మద్యం, డ్రగ్స్‌లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామంలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అత్యవసర వేళ, డయల్ 100కు కాల్ చేయాలని వివరించారు. పత్రాలు సరిగా లేని 104 ద్విచక్రవాహనాలు, ఏడు ఆటోలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో సీఐ నైలు, ఎస్సైలు శంకర్, సుప్రియ, పోలీసులు, గ్రామస్తులు ఉన్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

నిర్మల్: అదుపుతప్పి ఆటో బోల్తా పడగా నలుగురు గాయపడ్డ ఘటన మంగళవారం నర్సాపూర్(జి) మండలం అర్లి(కె) శివారులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బూరుగుపల్లి (కె) గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు పని ముగించుకొని ఇంటి వెళ్తుండగా అర్లి(కె) గ్రామ శివారులో ఆటో డ్రైవర్ మగ్గిడి కైలాష్ అజాగ్రత్తగా నడపడంతో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న చిన్నమ్మ, లక్ష్మి, శనిగారం సుధాకర్‌తోపాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో భైంసా ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నమ్మకు కొడుకు వరుస అయిన కల్యాణ్ కర్ వెంకట్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.